# ఆఫ్టర్ థర్టీఫైవ్

"మంగమ్మ శపథం సినిమా .... ఫస్టుషోకు వెడదాం వస్తావా పార్వతీ ?" అంది కో లెక్చరర్ సుధ, లేడీస్ వెయిటింగ్ రూంలో.

"ఊహూఁ ! నే రాను."

"ఏం ? చాలా హుషారుగా వుంటుందోయ్ పిక్చర్ ! ముఖ్యంగా మంగమ్మ కన్ను గీటే సీన్, డాన్స్, సెక్సీడ్రెస్....ఓహ్ !"

"నా మొహం !"

"ఏమిటి ? నీ కలాటి రొమాంటిక్ సీన్స్ ఇష్టం లేదా ? లేక చాలామంది ఆడవాళ్ళలా ఇష్టంలేనట్లు నటనా ?" సుధ నిలదీసి అడిగింది.

"నటనేం ఖర్మ ! నిజంగానే ఆ పిక్చర్ నా కిష్టంలేదు. ఏదో పిచ్చి పంతానికి పోయి, కోరుకున్న అమ్మాయిని పెళ్ళాడికూడా ఆమెను సుఖపెట్టి, తాను సుఖపడలేకపోయిన ఆ రాజూ; పిచ్చిపంతంతో, దొంగ వేషంతో, దొంగ నటనతో, దొంగతనంగా స్వంత మొగుణ్ణి ఆకట్టుకుని, పరాయిదానిలా అనుభవించబడి, బిడ్డను కనడం, ఆ అమ్మాయిది. అదీ ఓ గొప్పే ! ఇద్దరికిద్దరూ ముదివగ్గులయ్యేవరకూ ఒకరి నొకరు వంచించు కుంటూ జీవచ్ఛవాలలా బ్రతికిన ఆ కథంటే నాకు ఎలర్జీ" అంది పార్వతి. మరోనిముషంలో మళ్ళీ అంది. "ఏదేనా విఠలాచార్యదే మరో పిక్చరుంటే చెప్పు. తప్పకుండా పోదాం ! హాయిగా రాజులూ, రాణులూ, ముష్టెత్తుకునే వారిలా, చిన్నచిన్న బట్టలు కట్టుకుని గమ్మత్తుగా పాటలు పాడుతుంటారు! పాటల ట్యూన్స్ బావుంటాయి. మనం ఏ 'జూ'లోనూ చూడని, చూడలేని ఎన్నెన్నో వింత వింత బల్లుల, తొండల, మొసళ్ళ ఆకారాలూ; తోకలూ, కొమ్ములూ గల జీవరాసుల ముష్టియుద్ధాలూ చూడవచ్చు ! అన్నిటి కంటే

ముఖ్యం - హీరో, విలనూ (మాంత్రికుడూ) ఎంచక్కటి జలపాతాల దగ్గరా, కొండల దగ్గరా కొట్టుకుంటూ ప్రేక్షకులకు కథను గురించిన ఆలోచన రానివ్వరు! మనం స్టంటు చూడక్కరలేను. దాని తాలూకు, గొలుసుల, ముళ్ళగదల తాలూకు మ్యూజిక్ వినవచ్చు. ఏమంటావ్?" అంది నవ్వుతూ.

సుధ ఎగిరి పడింది. "వెధవ ఓేస్టూ నువ్వూను. మాట తప్పించకుండా బెట్టు చెయ్యకుండా పద. నాకా రాజశీవి నచ్చింది. ఎవరేమనుకుంటారోనని ఏడ్చి పోకుండా (ఈనాటి చాలా మంది మగాళ్ళలా!) ఎంచక్కా నచ్చిన ఆడదానితో నచ్చినట్లు డాన్స్ చేసే ఆ రాజు పద్ధతి చాలా హుషారుగా వుంటుంది. అలా వుండాలి మగాడయినా, ఆడదయినా...." ఘోరంగా సాగుతున్న సుధ వాక్ప్రవాహానికి అడ్డువస్తూ అరిచింది పార్వతి.

"చాల్చాల్లే తల్లీ! ఆపు, ఆపేసేయ్! నీ ఈ ఉపన్యాస హింసాకాండకంటే ఎక్కువ బాధాకరం కాదు ఆ సినిమా. పద వస్తాను" అంది చిరాగ్గా.

సుధ నవ్వింది. "గుడ్! ఏ మనిషిని ఎలా లొంగతియ్యాలో నాకు బాగా తెలుసు. పద, ఇంటికి వెళ్ళి ఆయనగారిని లేవదీసి బయల్దేరే సరికి టైమవుతుంది." సుదర్శనం కూడా వస్తాడనే సరికి, పార్వతి ఆలోచనలో పడింది.

"లాస్ట్ అవర్ క్లాసుంది నాకు. ప్రిన్స్‌పాల్‌గారికి చెప్పి, స్టూడెంట్సుకి చెప్పి ..." పార్వతి మాటలు మధ్యలో ఉండగానే, ఆమె సాకు చెబుతోందని తెలుసుకున్న సుధ విరుచుకు పడింది.

"....కో లెక్చరర్స్‌కు చెప్పి, కాలేజీ వాచ్‌మెన్‌కి చెప్పి, గోడలకీ, ప్లేగ్రౌండ్స్‌కీ చెప్పి ...ఛత్....ఇదేం కృతయుగమా? కలియుగమా?

ఇంకా మాట్లాడితే కలికియుగం! స్టూడెంట్సూ, కుర్ర మగ లెక్చరర్సూ, (బహుశా ప్రిన్సిపాల్‌గారు కూడాను) నీ చెప్పటాల కోసం ఆగబోవటం లేదోయ్ బడుద్ధాయీ! డింపుల్ కపాడియా పాపం, ఒళ్ళు దాచుకోకుండా శ్రమించి, పరిశ్రమించి, విజృంభించి నటించిన "బాబీ"కి పరుగెత్తు తున్నారు. లాస్ట్ అవర్ నువ్వున్నా, నువ్వొక్కర్తెవూ మిగిలిపోతావు క్లాసులో! పోనీ డింపుల్‌కపాడియా నిర్మాతల నెలా ఉద్ధరించిందో (పేదరికంలో నుంచి) పేదలకూ, గొప్పవారికీ బట్ట లవసరం లేదని, నోషలిజం ఎలా సాధించిందో చూద్దామా? నేనోసారి చూశాననుకో! నీ కోసం వస్తాను!"

పార్వతి తల పట్టుకూర్చుంది. ఏదో ఒక పిక్చరుకు రాందే వది లేట్టులేదు సుధ. మంగమ్మ శపథమే నయం! ఒకటికి మూడు మార్లు వచ్చిపోయిన పిక్చరు! జనం ఆట్టే రద్దీగా వుండరు. "బాబీ" కాలేజీ స్టూడెంట్సుతో, లెక్చరర్స్‌తో, కుర్రకారు ఉద్యోగస్తులతో, పీకలు నొక్కేంత రష్‌గా వుందిట! అదీగాక, నిన్నను, సుధ బాత్‌రూంలో వుండగా, సుదర్శనం తన పోర్షన్ వైపొచ్చి, "బాబీకి వెడదాం వస్తారా పార్వతీ! చాలా బావుందిట!" అన్నాడు.

తన స్టూడెంటు హేమ గుర్తొచ్చింది. ఆ అమ్మాయి ఎవరో కుర్రా డితో ఇంగ్లీషు పిక్చర్‌కు ఎంగేజ్‌మెంటు యిచ్చినట్లు చెప్పింది తనతో. తన కెందుకో హేమ కేదేనా చెడు జరుగుతుందేమోనన్న భయం వేసింది. "హేమా! డోంట్ గో మై చైల్డ్! గోయింగ్ టు యాన్ ఇంగ్లీష్ పిక్చర్ అలాంగ్ విత్ ఎ బ్రాయ్‌ఫ్రెండ్, ఈజ్ ది ఫస్ట్ స్టెప్ ఆఫ్ యువర్ డౌన్ ఫాల్!" అంది. హేమ నవ్వేసి వెళ్ళిపోయింది. సరిగ్గా తనకూ సుదర్శనం ఆహ్వానాన్ని అంగీకరించటం అలాటి తప్పే ననిపించింది. అందుకే సున్నితంగా "ఊహూఁ నే రాలేనండీ! ఈ రోజు ఒంట్లో బాగా

లేదు. మీరూ, సుధ వెళ్ళిరండి. బాబునూ, బేబీనీ నే చూస్తుంటాను!" అంది. సుదర్శనం "నెవర్ మైండ్!" అనేసి తన పోర్షన్‌లోకి వెళ్ళి పోయాడే గానీ, కాస్తంత ముఖం మాడ్చుకున్నా డనిపించింది. ఈ రోజు మళ్ళీ....

"ఏమిటి పార్వతీ! మళ్ళీ ఆలోచనే! చచ్చాంరా బాబూ! సినిమా ఏదన్నది జటిల సమస్య అయి, దాన్ని గురించి కమిటీ వేస్తేగానీ కదలవా ఏమిటి? ఇంకాస్సేపిలాగే వుంటే, మూడ్ మారి, అసలు రాను పొమ్మం టావు. మంగమ్మ శపథానికే పోదాం" సుధ అరుస్తూ లేపుకుపోయింది.

సినిమాహాల్లో పార్వతి ఊహించినంత తక్కువగా లేరు జనం! ఆడా మగ కిక్కిరిసి కూర్చుని వున్నారు. హైక్లాస్ సీట్లలో కూడా, రెండు వేపులా ఆడవాళ్లు, మధ్య మూడు ఖాళీగా వున్న నెంబర్ల సీట్లు వచ్చాయి. విధిలేక సుదర్శనం మధ్యలో కూర్చుంటే పార్వతీ, సుధ చెరో వేపు కూర్చున్నారు. పార్వతి ఎటు సర్దుకుందామని చూచినా, మరో మగాడి పక్కనే కూర్చోవలసి వచ్చేలా వుంది.

"ఇంత పెద్ద రాజుకు "ఢీ" సరదా ఏమిటి? కొత్తగా తీసిన పిక్చర్లోనయినా మరో రకం ఆటేదయినా పెట్టాలని తోచలేదు కాబోలు నిర్మాతా, డైరెక్టర్లకు" అన్నాడు సుదర్శనం పార్వతి వేపు తిరిగి. పార్వతి పలకలేదు. ఆమె శరీరమూ, మనసూ బిగుసుకుపోయినట్లు న్నాయి. తెరమీద కథ జరుగుతోంది. పంతం పట్టిన ఆ అమ్మాయి గతి ఏమైంది? రాతి సమాధి లాటి భవనంలో జీవచ్ఛవంలా మార్చ బడింది. ఆ రాజేమో, రోజుకో అమ్మాయితో కులికేస్తున్నాడు. పరాయి దానిలా' ఆకర్షించి, గర్భం దాచుకుంటూ బిడ్డను కని, రహస్యంగా పెంచి, చివరి దశలో యవ్వనం, ఆనందం అంతా ఇగిరిపోయాక, ఆ రాజుకూడా అన్ని అనుభవాలూ పూర్తయి అశక్తుడై పోయాక, పంతం సాధించుకున్న తృప్తా? గర్వమా? ఏం సాధించారు వాళ్ళిద్దరూ?

కానీ ఈనాడు తన బ్రతుకు ? అలాటి పంతంలోనే పడిందా ? నాటికీ నేటికీ స్త్రీ జీవితం ఒక్కలానే వుందా ? ఆనాడు ఆ రాజు నిర్మించిన బందిఖానా అయితే, యీ నాటి స్త్రీ తనంత తానుగా చుట్టూరా తెరలు వేసుకొంటోంది. ఆనాడు ఆమె చెడిపోవాలన్నా, వీలేనంతటి కట్టుదిట్టమైన ఏర్పాట్లు ! కానీ ఈనాడు, చెడిపోవటానికి సవాలక్ష అవకాశాలు. నిజానికిదే నిజమైన అగ్నిపరీక్ష ! ఇలాగే ఓసారి తను, విశ్వం మంగమ్మ శపథం సినిమాకు వెళ్ళారు ! మొదటి మారు చూడటం ఆ పిక్చర్ !

పార్వతికి తెరమీద సినిమా కనిపించటంలేదు. తెరంతా అలికేసినట్లయి, దానిమీద ఆమె, విశ్వం, మరెవరెవరో పాత్రలు మాత్రం కనిపిస్తున్నారు.

పార్వతి నుంచి తనాశించిన రెస్పాన్స్ రాకపోవటంవల్లో, సుధ గట్టిగా కాలుతొక్కటంవల్లో, సుదర్శనం, సుధవేపు తిరిగి కామెంట్సు చేస్తున్నాడు.

*　　*　　*　　*　　*

"పార్వతీ, హౌనైస్ పార్వతీ ! హీరోయిన్ పైట ఎగరేసిందోయ్ ! కాదు కాదు ప్రేక్షకులమీదికి వల విసిరేసిందోయ్ !" అన్నాడు విశ్వం పార్వతి చెవిలో గుసగుసగా. పక్క సీట్లవాళ్ళు వింటారేమోనని భయంవేసింది పార్వతికి. "ఉష్ !" అంది మందలింపుగా.

"అయ్యో బాబోయ్ ! హీరోయిన్ డ్రెస్ చంపేస్తోందోయ్ పార్వతీ ! అలాటి డ్రెస్‌లో అలా ఎవరేనా వస్తేమాత్రం వదిలిపెట్టనోయ్ పార్వతీ ! ఏకపత్నీ వ్రతం, గాడీద గుడ్డూ, జాన్తానై !"

"అలాగే ! ఎవరేనా రానీండి ?" అంది పార్వతి నవ్వుతూ.

"ఏం, రా రంటావా ? నేనంత చవటనంటావా ? నా పర్సనాలిటీ, నడకా, నవ్వూ, ఈల, వల."

"నా తల ! సినిమా అయిపోతుంది స్వామీ !"

"పోతే పోనీ" అన్నాడు విశ్వం ఉక్రోషంగా.

ఇంటికి వచ్చాక తన యూనివర్సిటీ లైఫ్‌లో, ఎంతమంది తనకు ప్రేమ లేఖలు వ్రాసిందీ, తనెలా వాళ్ళను తిరస్కరించిందీ చెప్పాడు విశ్వం. ఓపిగ్గా విన్న పార్వతి నవ్వింది. "అప్పుడు మీరు చిన్నవాళ్ళు."

"ఇప్పుడు నేనేం ముసలివాణ్ణా ! నాకోపం పడిగాపులుగాచే అమ్మాయిలు, టీన్ ఏజ్‌గర్ల్స్ ఎంతోమంది వున్నారు. కానీ వెధవ ఆదర్శమే అడ్డొస్తోంది."

"రాత్రంతా సరదా అయిన చర్చలతో సాగిపోయింది.

తెల్లారి బెడ్ రూంలో, కిటికీ దగ్గర కూర్చుని, విశ్వం షేవ్ చేసుకుంటున్నాడు. పార్వతి వంటింట్లో ఏదో పని చేసుకుంటున్నది.

కెవ్వుమంటూ అరిచాడు విశ్వం. గాభరాగా పరుగెత్తుకు వచ్చింది పార్వతి "ఏమయ్యింది? బ్లేడు కోసేసిందా !" అంది కంగారుగా.

"ఊహూఁ ! ఇలా చూడు ! ఫలితకేశం ! నెరసిన వెంట్రుక ! ఇది నా వయసును గుర్తుచేస్తోంది ! నా మొహం ఇక ఏ ఆడపిల్లా చూడదని బెదిరిస్తోంది ! నాలో ఆకర్షణ తగ్గుతోందని హెచ్చరిస్తోంది. బాప్‌రే ! ఎలా ? ఎలా పార్వతీ ? ఇలా జుత్తంతా నెరసిపోతుందేమో !" అన్నాడు ఆందోళనగా.

పార్వతికి జాలేసింది. "ఏమీ నెరవదులెండప్పుడే" అంది అనునయిస్తూ. "బాల నెరపేమో !" అందికూడా.

"నా బొంద ! నా వయసు ముప్పైఐదు దాటింది. ఆఫ్టర్ థర్టీ ఫైవ్ ! పెద్దవాళ్ళలో జమ అయిపోతున్నాను. ఇంకే ఆడదీ నావేపు సరిగా చూడదా !" అన్నాడు మరింత బాధపడిపోతూ.

"బావుంది. ఏ ఆడదో చూస్తే ఏం ? చూడకపోతే ఏం ?" అంది పార్వతి నవ్వుతూ.

"అక్కడే వుందోయ్ లైఫ్‌లోని థ్రిల్లంతా ? నువ్వు పెళ్ళానివి ! నీకు తప్పదు ! కానీ ఇతర ఆడవాళ్లు, నా గురించి "పెద్దవాడు" అనుకుంటే ఎలా !"

ఆ రోజునుంచీ విశ్వంలో కొత్త మార్పు వచ్చింది. షేవింగ్ అరగంట పైగా పడుతోంది. అద్దంలో తల అన్నివేపులా, అన్ని కోణాల్లోనూ చూచుకోవటం, ఎక్కడేనా నెరసిన వెంట్రుక వున్నట్టు అనుమానం వస్తే, దాన్ని పళ్ళ గిట్టకరచి లాగిపారెయ్యటం చేస్తున్నాడు.

"ఒద్దు మీకు బాధ. మీరలా ఎన్ని లాగేసినా, మరికొన్ని ఉండనే వుంటాయి. అంతగా అయితే హేర్‌డై వాడండి." అంది పార్వతి. విశ్వం ఒప్పుకోలేదు.

డ్రెస్ చేసుకోవటంలో కూడా ప్రత్యేక శ్రద్ధ కనబరుస్తున్నాడు. డ్రెస్సింగ్ టేబిల్ ముందు, ఆడవాళ్ళకంటే అన్యాయంగా అరగంటసేపు పాంటు సరిచేసుకోవటమూ, నెక్‌టై సరిచేసుకోవటమూ, క్రాఫ్ మళ్ళీ దువ్వుకోటమూ, మీసాలు, సన్నని కత్తెరతో సుతారంగా కత్తిరించుకోవటమూ, హఠాత్తుగా పార్వతికి ఎదురుగా వచ్చి నిల్చుని "ఇప్పుడెలా వున్నాను పార్వతీ !" అనటమూ చేస్తున్నాడు.

"నా రాజు నా కెలావున్నా బావుంటారు !" అంది పార్వతి సుతారంగా అతగాడి చెంపలు రాస్తూ.

"నీక్కాదోయ్! చూచే వాళ్లకి!"

"చూచే వాళ్లకి మగాళ్లకైతే సాధారణంగా, ఆడవాళ్లకైతే అసాధారణంగా!" నవ్వు దాచుకుంటూ అంది పార్వతి.

పార్వతికి అర్థమయింది విశ్వం బాధ! ఆఫ్టర్ థర్టీఫైవ్, వయసు మీరిపోతోందేమోనన్న భయం. తెల్ల వెంట్రుకలు, వృద్ధాప్యాన్ని సూచిస్తున్నాయేమో నని గుబులు. అదో రకమైన "ఇన్‌ఫీరియారిటీ కాంప్లెక్స్" వచ్చేసింది భర్తలో. అంచేతే అది పెరిగి, అతగాడిలో నీరసమూ, నిస్పృహ చోటుచేసుకోకుండా, తనే చొరవ తీసుకుని, హుషారుగా వుంచాలని నిశ్చయించుకుంది.

"ఈ డ్రెస్‌లో మీరు చాలా అందంగా వున్నారు, టీన్ ఏజ్ కుర్రాడిలా. మాలతికూడా ఆ మాటే అంది నిన్న" అందోరోజు.

"మాలతి అన్నదా? నిజంగా మాలతే అన్నదా?" నమ్మలేనట్లు అడిగాడు.

"అవును. మీ ఫొటో ఆల్బం చూచి, మీ ఫ్రెండ్సందరిలో మీరే బావున్నారంది!" అంది పార్వతి మళ్ళీ.

"నిజంగా!"

"ఒట్టు!"

విశ్వంలో ఓ విధమైన తృప్తి, అదే తనకు కావాలి. కానీ మాలతి అన్నదంటేనే కలిగే తృప్తి అయితే, కొంచెం బాధే!

ఎదురింట్లో కొత్తగా వచ్చి చేరిన ఎగ్జిక్యూటివ్ ఇంజనీరు, ఆయన భార్యా, ఆయన మరదలు మాలతీలతో పార్వతికి త్వరలోనే పరిచయం పెరిగింది. పిల్లల్లేని కారణంగా, చెల్లెల్ని దగ్గరకు తీసి, ఎం.ఎ. వరకూ

చదువు చెప్పించి, ఇక పెళ్ళి చేసెయ్యాలనుకుంటున్నారు ఇంజనీరు దంపతులు. మాలతి మాత్రం అప్పుడే పెళ్ళివద్దనీ, మరో నాలుగేళ్ళు తను "సంగీత సాధన" చేసి, రేడియో ప్రోగ్రాంలు ఇచ్చాకే, పెళ్లాడతాననీ పట్టుబట్టింది. వాళ్ళింట్లో ఆ అమ్మాయి ఆడింది ఆట, పాడింది పాట ! ఆ పాట, వీణ కావటంవల్ల ఆ వీధి వాళ్లు బ్రతికిపోతున్నారన్నాడు విశ్వం, పార్వతి ద్వారా ఆ వివరాలు విన్నప్పుడు.

మాలతి తెల్లగా, బొద్దుగా వుంటుంది. ఆమె అట్టే అందమైనది కాదుగానీ, ఆ అమ్మాయి రింగులు తిరిగిన జుత్తు, అదో ప్రత్యేక ఆకర్షణ ఎవరికైనా. విపరీతంగా రింగులు తిరిగిన ఒత్తయిన తలకట్టూ, భుజాలుదాటని పొట్టి పొట్టి రెండు జడలూ, తమాషాగా వుంటుంది చూడటానికి.

"నీలా కరల్డ్ హేర్ నాకూ వుంటే బావుండేది మాలతీ ?" అంది పార్వతి మాలతితో పరిచయం, చనువూ పెరిగాక ఓ రోజు. మాలతి మాత్రం నిర్లక్ష్యంగా నవ్వింది. "ఈ వెధవ రింగులతో చస్తున్నాననుకో అక్కయ్యా ! ఉదయాన్నే నిద్రలేవగానే, తలంటు పోసుకున్న రోజూ, అద్దంలో నా మొహం చూచుకోవాలంటే నాకే భయం వేస్తుంది. ఏదైనా అతి అయితే అసహ్యం కాదూ !"

ఆ మాట కొంచెం నిజమే, తలంటు స్నానం చేసిన రోజు, మధ్యాహ్నంగాని మాలతివస్తే, గాలిలోకి ఉంగరాలుగా లేచిన ఆమె జుట్టు కాస్త చికాకుగానే వుంది చూడటానికి. మధ్యాహ్నం ఇంటి దగ్గరే వున్న విశ్వం, అదాటుగా ఆమెను చూచి-తర్వాత పార్వతితో కామెంట్ చేశాడు.

"ఏమంటోంది నీ పిల్ల పిశాచం ? అదే చెల్లి పిశాచం ! ఆ అమ్మాయి జుట్టు చూస్తుంటే నాకు వెంకటేశ్వర మహత్యం సినిమాలో శాపగ్రస్తుడైన శరభుడు, ప్రేతంలా మారినప్పుడు (రమణారెడ్డి) తల

మేకప్ సరిగ్గా అలాగే వుంది గాలిలోకి రింగులు తిరిగి. చిన్నప్పుడు నేను "చందమామ"లో "పాపిష్ఠిముఖాలు" అన్న సీరియల్ చదివాను. ఆ పాపిష్ఠిముఖాల రాక్షసుడి తలమీది జుట్టుకు బదులు, పాములు ఇలాగే రింగులు తిరిగి వున్నట్లు చిత్రించాడు చిత్రకారుడు!" "ఏదో ఒకటి లెండి ? ఆ అమ్మాయి వింటే బావుండదు!" అంది పార్వతి. పార్వతికి, మాలతితో చక్కటి కాలక్షేపం అవుతోంది. మాలతి అస్తమానూ వెంటా, వెనకా తిరుగుతూ, తన యూనివర్సిటీ అనుభవాలూ, తన వెంటపడిన అబ్బాయిలూ, వాళ్ళ ప్రేమలేఖలూ, తను వాళ్ళకు చెప్పిన బుద్ధులూ, తన పొట్టి ఉంగరాల జుట్టుమీద గేయాలు వ్రాసిన ప్రబుద్ధుల కథలూ విరగబడినవ్వుతూ చెబుతుంటుంది. ఆ అమ్మాయిలో ఇంకా పసితనం వదల్లేదనిపిస్తుంటుంది పార్వతికి. ఆ మాటే విశ్వంతో అంటే, "నీకూ్కడా! అలా చూడు వాళ్ల డాబా మీద. ట్రాన్సిస్టర్ గుండెలకు హత్తుకుని "మొహబత్, ప్రేమ, లవ్, ఇన్‌బమ్" తాటాకు వివిధ భాషా పాటలు ఎలా తన్మయత్వంతో వింటోందో! ఆ అమ్మాయికి పెళ్ళి కావాలి. కానీ వద్దంటోంది! అదే గమ్మత్తు!" అంటాడు.

అలా ఎగతాళి చేస్తుండిన విశ్వం, ఓ రోజు హఠాత్తుగా వేళగాని వేళ ఆఫీసునుంచి ఇంటికి వచ్చాడు, పని అయిపోవటంవల్ల. అతగాడు వచ్చేసరికి, హాల్లో ఓ రసవత్తర ఘట్టం జరగబోతోంది. వీధి వాకిలివేపు మొహంపెట్టి, సోఫాలో కూర్చునివుంది పార్వతి. పార్వతికి ఎదురుగా, వీధివాకిలికేసి వీపుపెట్టి, గంగిరెద్దులా రెండు టవల్స్, ఓ చీరె (పార్వతిది) పైన కప్పుకుని నడుములమీద చేతులు పెట్టి, కాళ్లు ఎడంగాపెట్టి "గంగావతరణం" ఫొటోలో శివునిలా నిల్చునివుంది మాలతి. విశ్వాన్ని చూచిన పార్వతి, లోపలికిరావద్దనీ, సద్దుచేయవద్దనీ సైగచేసింది. తన ధోరణిలో ఏదో చెబుతున్న మాలతి అదేం గమనించలేదు.

"ఊ ! రెడీ ! చూడక్కయ్యా ! రాత్రి నే చూచిన పిక్చర్లో జ్యోతిలక్ష్మి క్లబ్ డాన్స్ !" అంది మాలతి.

విశ్వం కుతూహలంగా, పిల్లిలా కిటికీ వారగా వచ్చి నిల్చున్నాడు.

"ఊ !" అంది పార్వతి నవ్వుతూ.

వెంటనే మాలతి విజృంభించింది. "ఊహ్ !" అంటూ అరిచింది. వెంటనే ఎల్లారీశ్వరి గొంతుతో ఏదో పాట లంకించుకొని, సోఫామీదికి ఎగిరి దూకింది. దాని మీదనుంచి రేడియో టేబిల్ మీదికి, అక్కణ్ణుంచి ఒక్కొక్కటిగా పైమీద వున్న పార్వతి చీరె, టవల్స్ విసరివిసరి గిరాటేసింది. ఆ ఊపులోనే తన ఒంటిమీద వున్న చీరకూడా లాగిపారేసి, ఎగిరి పార్వతి కూర్చుని వున్న సోఫామీదికి దూకి, ఉట్టి అండర్ వేర్ (లంగా)తో, జాకెట్ తో, పార్వతి భుజంమీద ఒక కాలుపెట్టి, చేతులు రెండూ గాలిలోకి ఎత్తేసింది !

అంతగా బరితెగించి చేస్తుందనుకోని పార్వతి క్షణకాలం నిర్ఘాంతపోయింది. అప్రయత్నంగా ఆమె కళ్ళు కిటికీకేసి తిరిగాయి. విశ్వం విభ్రాంతిగా చూస్తున్నాడు !

నవ్వుతున్న మాలతి మళ్ళీ ఎగిరి మరో సోఫామీదికి దూకుతూ కిటికీలో కనిపించిన విశ్వం ముఖం చూచి కొయ్యబారిపోయింది. ఏం చెయ్యటానికీ తోచని స్థితిలో పడిపోయింది. మరుక్షణం, అదే వూపుతో కిందికి దూకి, సోఫాలో వుండచుట్టిపడివున్న చీరె లాక్కుని, పక్కగదిలోకి పరుగెత్తింది.

పార్వతికి చాలా బాధ కలిగింది. భర్త చూపులకుకాదు, పరాయి ఆడపిల్ల పరువుపోయిందే అని ! తను విశ్వానికలా సైగ చెయ్యకుండా వుంటే బావుండేది. విశ్వం రాగానే, మాలతి డాన్స్ ప్రయత్నం విర

మించుకునేది కదా ! పైగా అలా "స్ట్రిప్‌టీజ్" చేస్తుందనుకోలేదు. ఒళ్లు తెలియని హుషారులో చేసేసింది ! విశ్వం - కావాలని చాటునుంచి పొంచి చూస్తున్నాడనుకుని నీచుడిగా వూహించుకుంటుందా ? చీరె కట్టుకున్న మాలతి, వెళ్లొస్తానని కూడా చెప్పలేని సిగ్గుతో, గబగబా ఇంటికి వెళ్ళి పోయింది.

"నీ చెల్లెలు ఇంచక్కటి డాన్సరని నాకు తెలీదోయ్ ! జ్యోతి లక్ష్మికంటే బాగా చేసింది !'' అన్నాడు విశ్వం.

"అవునుగానీ, పాపం, ఆటపట్టించకండి !" అంది పార్వతి.

''అమ్మమ్మా ! ఆటపట్టించటమే ? ఆటపట్టించానంటే, ఇందాక నీ భుజంమీద వుంచిన కాలు, ఈ మారు నా నెత్తిన పెట్టేస్తుంది.''

కానీ తర్వాత ఎప్పుడూ విశ్వం, మాలతిని ''పిల్ల పిశాచం'' అనలేదు. మాలతి మర్నాడు వచ్చి మరీమరీ అడిగింది పార్వతిని "బావ గారు వెక్కిరించారా ! ఏమన్నారు?''

ఏమీ అనలేదంటే నమ్మదే !

తర్వాత తర్వాత, మాలతి వచ్చినపుడల్లా ''బావగారు లేరా ?" అనటం, విశ్వం వచ్చాక, అతగాడితోనూ ఏవో కబుర్లు, పార్వతితోబాటు కల్పించుకుని మాట్లాడటం ప్రారంభించింది. విశ్వానిక్కూడా బెరుకుతగ్గి, బాగా మాట్లాడుతున్నాడు.

ముగ్గురూ సినిమా కబుర్లలో పడ్డారంటే టైమే తెలీదు.

విశ్వానికి తన మేకప్‌మీద శ్రద్ధ మరింత పెరిగింది !

"ఇలా కట్ బనీను వేసుకుంటే, నా ఛాతీ గొప్పగా వుందికదు పార్వతీ ! ఈ ఛాతీమీద తలవాల్చాలని, ఎందరో పడుచు పిల్లలు కలలు గంటున్నారనుకుంటాను !''

"అవునవును" పార్వతి నవ్వుతుంది. పోనీ ఆ తృప్తి అలా వుండనీ! అన్న భావంతో!

"ఈ గ్రే కలర్ సూటులో నేనెలా వున్నాను?"

"చాలా బావున్నారు."

"నీకు ఎగ్రాసిలా వున్నా బావుంటాను!" చిరాగ్గా అరిచాడు విశ్వం.

"ఓ! అదా! మాలతికూ్కడా బాగానే వుంటారు!"

"ఆ మాటందా?"

"ఎందుకంటుంది? పెళ్ళికాని పిల్ల! పరాయి మగాడితో!"

విశ్వం ముఖం ముడ్చుకున్నాడు.

మాలతి బావుందంటే, ఈయనగారికి సంతోషంగా వుంటుందేమో! పోనీ-అందనే చెబితే పోలా? "ఆఫ్టర్ థర్టీఫైవ్" అంటూ నిట్టూర్పులు తగ్గాయీ మధ్య!

కానీ ఓ రోజు, మాలతి కబుర్లు చెబుతూ బాగా చీకటి పడేవరకూ కూర్చుండి పోయింది. వెళ్ళొస్తానని బయల్దేరింది. పార్వతి, భోజనాల కోసం అన్నీ అమర్చటానికి వంటింట్లోకి వెళ్లింది. విశ్వం సిగరెట్ నోట్లో పెట్టుకుంటూ వరండాకేసి వెళ్లాడు.

ఏమిటో గుర్తుకువచ్చి, విశ్వంతో చెప్పాలని గబగబా హాల్లోకి వచ్చిన పార్వతికి, విశ్వం హాల్లో లేకపోవటం ఆశ్చర్యాన్ని కలిగించ లేదు గానీ, ఆశాభంగాన్ని కలిగించింది. లీలగా, గేటు దగ్గర మనిషి ఆకారం కనిపించి, ఏ ఫ్రెండో వచ్చి తగులుకున్నాడు కాబో లనుకుంటూనే, వరండాలోకి వచ్చింది. కానీ గేటు దగ్గర చిరు వెన్నెలలో, కొద్దిపాటి చీకటిలో, మాలతి రింగులు తిరిగిన జుట్టు

గాలిలోకి కనిపిస్తోంది. ఆ పక్కనే గేటుకొక్క_స్త దూరంలో నిల్చొని విశ్వం ఏమో మెల్లిగా అంటున్నాడు. ఒక్క నిముషమే! వందయుగాలుగా తోచింది పార్వతికి. విశ్వం హుషారుగా వెనక్కి వచ్చాడు. వరండామెట్లు ఎక్కుతూ, ఓ వారగా నిల్చునివున్న పార్వతిని చూచి, కంగుతిన్నట్లు ఆగిపోయాడు. అతగాడిలోని హుషారంతా బెలూనులోనుంచి గాలి తీసేసినట్లు మాయమయ్యింది!

"ఏమిటి పార్వతీ! ఇక్కడున్నావ్?"

"ఊరికే!" పొడిగా అంది.

ఇద్దరూ, మౌనంగా, చాలా మౌనంగా, ఎన్నడూ లేనంతటి మౌనంగా భోజనాలు ముగించారు.

కాస్సేపాగి, బెడ్‌రూంలో "ఏమిటోయ్! మూగనోము పట్టేశావ్! "ముసలి మొగుడితో" మాటలేమిటి అనుకుంటున్నావా? నెరసిన వెంట్రుకలు కనిపించాయా నా క్రాఫ్‌లో? ఈ రోజు నేను బాగాలేనా?" అంటూ రోజూ కంటే ఎక్కువ హుషారు ప్రదర్శించాడు.

పార్వతి ఫ్రీగా అతగాడి రొమాన్స్ భరించలేక పోయిందెంచేతో! ప్రతిఘటించనూ లేకపోయింది.

లోలోపల మాత్రం ఏదో సన్నని బాధ రేగింది. మాలతిపట్ల ఆకర్షణ పెంచుకుంటున్నాడా? తనమీద అభిమానం తగ్గుతోందా? తనతగాడిలో నిస్పృహ చోటు చేసుకుంటుందేమోనని భయంతో - మాలతి మాటలుగా, తను చెప్పిన కొన్ని తియ్యనైన అబద్ధాలు, తన మెడకే వురితాళ్లుగా మారాయా? లేక అసలు విశ్వం మన స్తత్వంలో - కొంత "వెరైటీ" చూసే స్వభావం దాగివుందా? అదిప్పుడు బహిర్గతం

అవుతోందా ? ఇన్నేళ్లు అవకాశం రాక, లేక, అలా అణగారి వుందా ? పెద్దమనిషి పోజ్ వేశాడా ?

ఆ మధ్య ఒసారి.... "ఏమంటోంది మీ చెల్లాయి నా గురించీ ?" అని విశ్వం అడిగినప్పుడు, నిజంగానే మాలతి అన్నమాటలు గర్వంగా చెప్పింది తను. "మీ నవ్వు బావుంటుందిట ! నవ్వేటప్పుడు మీ బుగ్గలు సొట్టలుపడి, మీ కళ్ళు చికిలించుకు పోతాయిట ! నేనంతగా గమనించ లేదు గానీ...."

"ఏమిటి ? నిజంగానే ,"

"నిజంగా !" అతగాడిలో ఆ 'ఇగో' తృప్తి పడటమే తనక్కావల సింది. అంచేత మరికొన్ని మాట్లాడింది. "మిమ్మల్నీ, నన్నూ వయసు జయించదు. కారణం చెప్పనా ! మనిద్దరి మనసులలో ముసలితనం ప్రవేశించకుండా కాపాడు కుంటున్నాం గనుక ! అరవై దాటినా మీలో, నాలో చురుకుదనం తగ్గదు ! మన పక్కింటి రమణరావు చూడండి, మీకంటే ఓ ఏడు చిన్నవాడేనట. ఈసురో మంటున్నట్లుంటాడు. మరి మీరో , కన్నుగీటే, టీన్‌ఏజ్ కుర్రాడిలా...." విశ్వం పలకలేదు.

"నమ్మటంలేదా నా మాటలు ! నా మనసులోకి చూడండి."

"నీ మాటలు నమ్ముతున్నాను పార్వతీ ! కానీ ఇవే మాటలు, మరో ఆడది కూడా చెబితే, మరింత నమ్మకం తోస్తుంది !"

ఆ ఆడది మాలతా !

మాలతి కేమొచ్చింది ? పెళ్ళికాదనీ, పెళ్ళి చెయ్యరనీ భయ మేమీలేదే !

కావాలనే విశ్వాన్ని "టీజ్" చేస్తోందా? విశ్వంలోని భూతాన్ని నిద్రలేపుతోందా! నిజంగా "పిల్ల పిశాచంలా" మారిపోతోందా! తరచూ అలాటి ఆలోచనలతో పార్వతి తల పగిలిపోతోంది. ఆ రోజు...."

"పార్వతీ! మంగమ్మ శపథం మళ్ళీ వచ్చిందోయ్! వెళ్దాం. నాకు నచ్చిన పిక్చరది!" అన్నాడు విశ్వం.

"అలాగే! కాస్తంత రిలీఫ్ అనిపించింది. తీరా ఇంటికి తాళంవేసి బయల్దేరే సైంకు మాలతి వచ్చింది. "నేనూ వస్తాను" అంటూ, వద్దని చెప్పటానికి సభ్యత అడ్డొచ్చింది పార్వతికి. "ఓ. కే!" అనేశాడు విశ్వం.

"ప్రీప్లాన్డ్ వ్యవహారమా?" అనుకుంది లోలోపల పార్వతి. మాలతి, మాలతి పక్కన పార్వతి, పార్వతి పక్కన విశ్వం కూర్చున్నారు. మొదటిసారి పిక్చర్ చూస్తున్నప్పటి కంటే ఎక్కువ హుషారులో - తెరమీద బొమ్మ ప్రతి కదలికకూ, చాలా పెద్ద కామెంట్స్ చేస్తున్నాడు విశ్వం. వాటిలో ఎక్కువ భాగం సెక్స్‌కు సంబంధించినవి. పక్కనో పెళ్ళిగాని పరాయి ఆడపిల్ల వుందన్న ధ్యాసలేనట్లు, పార్వతి మీదికి వంగి, మరీ చెబుతున్నాడు ఏవేవో!

పార్వతి కెలాగో వుంది. భర్త తన భుజం వేనుకగా వెసిన చెయ్యి తననిదాటి పోతోందేమోనన్న వూహతో బాటు, ఆ కామెంట్సు తనతోగాక, మాలతితో చేస్తున్నట్లనిపించి శరీరం బిగుసుకు పోయింది. వాళ్ళిద్దరిమధ్యా తనో వంతెనగా మాత్రమే మిగిలిపోయిందా? ఇద్దరికిద్దరూ తనని ఫూల్‌ని చేసి ఆడిస్తున్నారా? పార్వతి కాక్షణంలోనే ఆ సినిమామీద, సినిమా పేరుతో భర్త ఆడుతున్న నాటకంమీద తగని కోపం వచ్చేసింది!

"నాకు నాలా తలనొప్పిగా వుంది, ఇంటికెళ్ళి పోతాను!" అంది కోపాన్నీ, అసహ్యాన్నీ లోలోపల అణుచుకుంటూ పార్వతి....

"అరె! పిక్చరంతా ముందే వుంది. ఇప్పుడెలా?" అన్నాడు విశ్వం కంగారుగా.

"పోనీ వెళదాం"! అంది మాలతి అయిష్టంగానే.

"నే నొక్కర్తేనూ వెళ్ళగలను!" అనేసి జవాబు కాశించకుండా బయటకు వచ్చి నిల్చుంది, విశ్వం వస్తాడేమోనని. ఉహూఁ! రాలేదు. ఒక్కర్తీ ఇంటికి వచ్చింది. విశ్వం ఇంటికి వచ్చేలోగా, ఓ నిర్ణయానికి వచ్చేసింది పార్వతి....

ఈ ఆకర్షణ ఇలాగే సాగనీ! తనకెందుకు? తనేం చదువులేని దద్దమ్మ అయివుంటే, ఏడ్చి-పాదాల దగ్గరపడి వుంటాననేది! కానీ తనూ ఎం. ఏ. పాసైన స్త్రీ! తనూ ఉద్యోగం చేసుకోగలదు. ఇలాటి నయ వంచకుణ్ణి భర్తగా మాత్రం భరించలేదు....

ఆ రాత్రి విశ్వం వచ్చాక, పలకలేదు. విశ్వం ఆమెను ప్రసన్ను రాలిని చేసుకోవటానికి చాలాదూరం ప్రయత్నించాడు.

"మీలోని ఈ హుషారంతా, మాలతివల్లా, మాలతితో ఇందాకటి సాన్నిహిత్యంవల్లా కలిగినదే అయితే-అది నాదగ్గర ప్రదర్శించటాన్ని నేను సహించలేను! బెడ్‌రూంలో, బెడ్‌మీద, మీ ప్రతి కదలికలో, మాలతి రూపం అంతర్గతంగా-మిమ్మల్ని టీజ్ చేస్తుంటే-ఆ ఉద్రేకాన్ని పరోక్షంగా నాతో "నటించటం" నాకు అవమానం. ఒద్దు, ఈ నాటకానికి ఏ క్షణాన్నో, ఓ క్షణాన తెరపడి తీరవలసిందే! అది ఎంత త్వరగా వేస్తే అంత మంచిది".

"రేపు నేను వెళ్తున్నాను. చావటానికి కాదు. బ్రతకటానికి! మిమ్మల్ని క్షమించలేను. క్షమించ గలిగిన నాడు వస్తాను."

విశ్వం క్షణకాలం దిమ్మెరపోయాడు. మెల్లగా అనునయించాలని చూశాడు. ఇక మాలతి వూసెత్తనన్నాడు. ఊహూ పార్వతి వినిపించుకో లేదు. తనముందు, తనకు భయపడి మాలతితో రిజర్వ్‌డ్‌గా వుండవచ్చు. తను కనుమరుగైతే, మాలతి గాకపోతే మరో కోతి! అసలా చంచల త్వమే తనకు నచ్చనిది!

పార్వతి వెళ్ళిపోతుంటే విశ్వం దిగాలు పడిపోయాడు.

"పార్వతీ, ఒక్కమాట! ఈ మన, మనస్పర్థల గురించి ఎవరికీ చెప్పకు. మగాడు భార్యను వదిలేస్తే భార్య కెంత అప్రతిష్టో, ఆడది భర్త నొదిలి పెడితే - ఈ రోజుల్లో ఆ భర్తకూ అంతే అప్రతిష్ట. నేనా అవమానాన్ని భరించలేను. ప్లీజ్ ఆ ఒక్కమాటా ఇవ్వు చాలు. అలాగే అప్పుడప్పుడూ నేను వస్తుంటాను నీ దగ్గరకు. కాదనకు. నాకు తోచదు నిన్ను చూడకుండా!"

పార్వతికి జాలేసింది. అంతలోనే తమాయించుకుంది. ఇప్పుడిక తను మెత్తబడకూడదు. విశ్వాన్ని స్వేచ్ఛగా వదిలివేయాలి. అతగాడా స్వేచ్ఛతో మరింతగా దిగజారుతాడో, నిలదొక్కు కుంటాడో, అతనికే వదిలెయ్యాలి.

* * * *

పార్వతికి నియర్ అండ్ డియర్ ఫ్రెండ్ సుధ. పార్వతిరాకలో ఆంతర్యాన్నీ, ఆమె ఆలోచనల్నీ ఇట్టే-నేర్పుగా, ఆమె నోటి వెంటే పలికించింది.

"ఆల్‌రైట్! నువ్వేం చదువులేని వాజమ్మవు కావు! మీ శ్రీవారికో పాఠం నేర్పుదాం. మా శ్రీవారికిచెప్పి, మా కాలేజిలోనే లెక్చరర్ పోస్టులో నిన్ను ఇరికించేస్తాం." అంది ధైర్యం చెబుతూ.

సుదర్శనం బిజినెస్ మాగ్నెట్, మాంచి పలుకుబడివుంది. మూడో రోజుకే పార్వతి కాలేజిలో డ్యూటీలో జాయినయింది. సుధకూడా తోచక జాబ్ చేస్తోంది. పిల్లలిద్దరినీ చూడటానికి ఆయా వుంది. సుధకున్న ఇల్లు బాగా పెద్దది. అందులోనే, ఓ పక్కగా, పోర్షన్‌చేసి, పార్వతిని వుంచింది సుధ.

తరచూ, విశ్వం ఎలా వున్నాడో, మాలతితో బరితెగించి తిరుగుతున్నాడేమో, తన నసలు మర్చిపోయాడేమో, అన్న దిగులు లోలోపల కలుగుతున్నా, సుధ ఆమె మూడ్ గమనించి, ఏవో కబుర్లలోకి దింపి మరపిస్తోంది. సుధ పిల్లలు కూడా బాగా కాలక్షేపం పార్వతికి. నెల తిరిగే సరికి, విశ్వం వచ్చాడు. మనిషి ఏమీ తగ్గలేదు. ట్రిమ్‌గా డ్రస్, బాగా మేకప్‌మీద శ్రద్ధా!

"పార్వతీ! రా వెళదాం! ఉద్యోగం సరదా తీరిందిగా!" అన్నాడు నవ్వుతూ.

పార్వతి జవాబివ్వలేదు.

బ్రతిమాలి వెళ్ళిపోయాడు.

మూడునెలల తర్వాత, అప్పటికి సుధ కుటుంబంలో ఒకర్తిగా కలిసిపోయింది పార్వతి. మొదట్లో బెరుకుగా వుండే సుదర్శనం, మెల్లి మెల్లిగా మాట్లాడుతూ, సుధ వున్నా లేకున్నా, కబుర్లు చెబుతున్నాడు.

"పార్వతీ! నీలా శిగ వెయ్యవూ!" అందో రోజు సుధ.

"ఎందుకూ ? నీకా వాలుజడే బావుంది !" అంది పార్వతి.

"ఊహూఁ ! నీలా హుందాగా లేనుట ! మా శ్రీవారంటున్నారు. వెయ్యవోయ్ !" బ్రతిమాలింది సుధ.

సుధకు శిగవేసి పంపి, అద్దం ముందు కూర్చుంది పార్వతి. ఎంచేతో, సుదర్శనం తన శిగ మెచ్చుకున్నాడంటే, లోలోపల గర్వం కలిగింది. తాపీగా జడవిప్పి విరబోసుకుంది. పాపిట తీసుకోవటం కోసం పైకి దువ్వుకోవటంలో, చటుక్కున మెరుపులా కనిపించింది తెల్ల వెంట్రుక ! ఫలితకేశం !

తన తల నెరవబోతోందా ? బాబోయ్ ! తల నెరిస్తే ఈ అందం వుంటుందా? తను కూడా థర్టీ ఫైవ్‌లోకి వచ్చేస్తోంది ! ఆఫ్టర్ థర్టీ ఫైవ్, తను చాలా పెద్ద దానిలా, ముసలి దానిలా కనిపిస్తుందా ? ఈ ఆకర్షణ, చలాకీతనం వుండవా ?

"ఏం పార్వతీ ! కాలేజికి రావా ?" అంటున్న సుధ కంఠ స్వరంతో త్రుళ్ళిపడింది పార్వతి. కంగారుగా శిగ వేసుకుంది! కుదర లేదు సరిగా. దానికితోడు, వరండాలోకి వచ్చేసరికి సుదర్శనం ఎదురయ్యాడు. అప్రయత్నంగా పార్వతి చెయ్యి ఆమె శిగ మీదికి వెళ్ళింది ! ఈ రోజు సరిగా కుదరలేదేమో ! రేపట్నుంచి, మరి కాస్త శ్రద్ధగా మెల్లిగా వేసుకోవాలి.

"పార్వతీ ! అచ్చు నీలా నవ్వటం, నడవటం, గంభీరంగా వుండటం, ప్రాక్టీస్ చేస్తున్నాను. ఖర్మ ! తక్కువగా మాట్లాడటం నా తలకు మించిన పనౌతోంది సుమా !" అంది సుధ.

"నీ పద్ధతి నీది ! నా పద్ధతి నాది ! నన్ను అనుకరించటందేనికి ?" అంది పార్వతి.

"అదో రహస్యంలే। చెప్పనా।"

"చెప్పు।" కుతూహలంగా చూచింది పార్వతి.

"రాత్రి,బెడ్ రూంలో,మా శ్రీవారు నీ నామస్మరణ చేసేశారనుకో। నీలాటి అందమైన, సున్నితమైన, నెమ్మదైన ఇల్లాలిని పొందగలిగిన మీ శ్రీవారు చాలా అదృష్టవంతులట। చెప్పొద్దూ। నాకు తగని కోపం వచ్చింది మా వారి మీద। ఏం? నేను తగిన ఇల్లాలిని కాదా? ఏమిటో ఈ మగాళ్లు। ఆఫ్టర్ థర్టీ ఫైవ్ భలే మారిపోతారు।" పార్వతి గతుక్కుమంది. సుదర్శనం తన వేపు ఆకర్షితుడౌతున్నాడా। తనని గురించి, అస్తమానూ సుధ ముందు మెచ్చుకుంటున్నాడా। తను మాలతి విషయంలో ఫీలయినట్లే సుధ కూడా తన మీద లోలోపల కోపం, అసహ్యం పెంచుకొంటోందా। కొన్నాళ్ళకు అది బయట పడ్తుందా। సుధ అన్నట్లు అందరూ మగాళ్ళూ ఇంతేనా। మర్నాడు విశ్వం వచ్చాడు.

"పార్వతీ। ఇంకా కోపం పోలేదూ. మాలతికి పెళ్ళి నిశ్చయమైందోయ్, ఇకనైనా రావూ।" అన్నాడు ప్రాధేయపడ్తూ.

"మాలతి పెళ్ళితో, నా రాకతో సంబంధం ఏమిటి? మాలతి వెళ్ళాక, మరో అమ్మాయి దొరికేవరకూ నాతో అవసరంవుంటుందా?" అంది నవ్వుతూ.

"అలా అనకు పార్వతీ। నీతో అవసరం ఏమిటి? నువ్వు నా భార్యవి. నా దానివి. నీ నవ్వు, నీ మాటలు, నీ స్పర్శ నాలోనుంచి తొలిగిపోయిందెప్పుడు? నా పాలిట దేవతవు, రంభవు, మహాలక్ష్మివి, అరె। నా మాటలలో నమ్మకంలేదూ. నా కళ్ళలోకి చూడు ఒక్కసారి."

"మీ మాటలు నమ్ముతున్నాను. కానీ ఇవే మాటలు మరో మగాడు నాతో చెబితే, మరింత నమ్మకం కలుగుతుంది." అనాలోచితంగా

అన్న పార్వతి, ఆ మగాడు సుదర్శనమా అని తనకు తానే ఉలికిపడింది. తన మాటలలో ఎంత అసహ్యాకరమైన అర్థం ఇమిడివుందో బోధపడేసరికి.

చెర్నాకోల దెబ్బతిన్న మనిషిలా విశ్వం వడివడిగా వెళ్ళిపోతున్నాడు.

ఏమిటీ పంతాలు ? అర్థంలేని సాధింపులు ? తనేమైపోతోంది !

"పార్వతీ ! ఈ వింత విన్నావూ ! మా శ్రీవారికో కొత్త జబ్బు పట్టుకుందోయ్!" అంటూ సుడిగాలిలా వచ్చిన సుధ మాటలతో తేరుకొంది పార్వతి.

"ఏమిటి ?"

"తనలో అట్రాక్షన్ తగ్గుతోందా ? అని పదే పదే ప్రశ్నించి వేపుకుతింటున్నారు. నువ్వు చెప్పు, ఆయన అందంగా లేరూ !"

పార్వతి నవ్వింది. "రాజాలా వుంటారు !"

"నిజంగా నాండీ ! అనుకోకుండా గుమ్మంలో సుదర్శనం నిలబడి ప్రశ్నించటంతో పార్వతి మ్రాన్పడిపోయింది.

"మరోసారి చెప్పు పార్వతీ ! ఆయన బాగా నమ్ముతారు !" అని అంది సుధ.

పార్వతికి తనేదో అంతుచిక్కని అగాథంలో పడిపోతున్నట్లనిపించింది ! చటుక్కున లేచి మరో రూంలోకి వెళ్ళిపోయింది. గుండెదడ ఇంకా తగ్గలేదు. మాలతిలానే తనూ ప్రవర్తిస్తోందా ? లేక సుధ తనలా ప్రవర్తిస్తోందా ?

ఆ రోజు సాయంత్రం సుదర్శనం, సుధ లేని టైంలో తనతో కబుర్లకు దిగాడు. ఎంచేతో పార్వతికా కబుర్లలో పవిత్రత కనిపించలేదు. ఏదో దొంగాటకంలా అసహ్యకరమనిపించింది.

మొదట్లో సుదర్శనం తనను మెచ్చుకొంటున్నాడంటే గర్వంగా గొప్పగా వుండేది! తన అందంపట్ల అంతులేని ఆత్మ విశ్వాసం ఏర్పడింది. కానీ ఈనాడు సుదర్శనాన్ని ఎలా వదిలించుకోవాలో, సుధతో మనస్పర్థలు రాకుండా ఎలా ఇక్కణ్ణుంచి దాటిపోవాలో బోధపడటం లేదు.

ఈ పంతాలూ, పట్టింపులూ ఇలా ఎంతకాలం? విశ్వం చాలా నొచ్చుకుని వెళ్ళిపోయాడు. ఇకరాడేమో! అనరాని మాట అనేసింది! ఏ భర్తా సహించలేని మాట అనేసింది!

సుధ—తనకూ, సుదర్శనానికీ మధ్య వంతెనలా మారిందా? తను వాళ్ళిద్దరి మధ్య "పిశాచంలా" దాపురించిందా! లేకపోతే-సుదర్శనం ఎంతగా అడ్వాన్స్ అవుతున్నాడు? ఈ వలయంలోనుంచి బయట పడేదెలా?

* * * * * *

"పార్వతీ, లే! లే! సినిమా అయిపోయింది!" అంటూ సుధ తట్టి లేపే వరకూ పార్వతి ఓ విధమైన మైకంలోనే వుంది.

"మీరు ఎంచక్కా నిద్రపోయారల్లే వుంది!" అంటున్నాడు సుదర్శనం. పార్వతి త్రుళ్ళిపడింది. గతమంతా చెదిరి, వర్తమానం స్పష్టంగా భయంకరంగా కనిపిస్తోంది మళ్ళీ.

"ఇలా రాండి! ఇక్కడో స్టెప్ వుంది. తూలిపడతారేమో!" చప్పున పార్వతి చెయ్యిపట్టుకుంటూ అన్నాడు సుదర్శనం.

"నాకు తెలుసు" విదిలించివేసింది పార్వతి. సుధ, ఇద్దరివేపు ఎర్రగా చూచి, గబగబా కారుకేసి నడిచింది.

కారులో సుధ ఏమీ మాట్లాడలేదు. సుదర్శనం మాత్రం చాలా హుషారుగా, ప్రతి సీన్‌గురించీ, ముఖ్యంగా రొమాంటిక్ సీన్స్ గురించి, వెనక సీట్లో కూర్చునివున్న సుధ, పార్వతులకు వినిపించేలా కామెంట్ చేస్తున్నాడు.

పార్వతికి అర్థమైంది. ఆ కామెంట్స్ తనకై వుద్దేశింపబడినవి! ఆ సంగతి సుధ గ్రహించింది! అంచేతే ముభావంగా వుంది!

ఆ కుటుంబంలో తుఫాన్ రేగకముందే తను నిష్క్రమించటం మంచిది! కానీ ఎలా?

రాత్రంతా నిద్రపట్టలేదు పార్వతికి. తెల్లారేసరికి బాగా జ్వరం వచ్చేసింది.

తెల్లారాక, మామూలుగా నవ్వుతూ వచ్చింది సుధ. "ఏమిటీ జ్వరమా? మీ శ్రీవారికోసం బెంగపడ్డావా! సర్లె! కాలేజికి నే వెళతాను. మా వారు ఇంటిదగ్గరే వుంటారు. నీ కేదేనా కావలిస్తే ఇస్తారు!" అంది.

ఈ లోగా రెండుమార్లు వచ్చి "అయ్యో! జ్వరం వచ్చిందా?" అని తెగ నొచ్చుకుని వెళ్ళాడు సుదర్శనం.

"ఒద్దు సుధా! నాకేమీ అక్కర్లేదు. మగాడు, ఆయన నాకు సేవ చేసేదేమిటి? నేనీ పూట వూరికెళ్ళాలి. మా వారు రమ్మని రాశారు." అంది గాభరాగా.

సుధ మెత్తగా నవ్వింది. "జ్వరంతో ఎలా వెళతావు?"

"బాగానే! ఇక ఇక్కడుండలేను, వెధవజాబ్! సరదా తీరింది. అంతేకాదు. ఆయన ఏ తప్పులు చేసినా క్షమించగలను!" అంది పార్వతి. ఆమె కంఠం పూడుకుపోయింది.

సుధ ఆప్యాయంగా పార్వతి తల నిమిరింది. "పిచ్చి పార్వతీ! ఎందుకలా కంగారుపడతావు! నువ్వెక్కడికైవా వెళ్ళలేవు. మీ శ్రీవారు ఇక్కడే ఓ ఫ్రెండ్ ఇంట్లో వున్నారు. ఫోన్‌చేసి చెబుతాను రమ్మని."

పార్వతి నమ్మలేనట్లు చూసింది.

అరగంట తర్వాత గుమ్మంలో అడుగెట్టిన విశ్వం కేసి చేతులు చాచింది పార్వతి. అంతటి ఉద్వేగంతోనూ పార్వతిని దగ్గరకు తీసుకున్నాడు విశ్వం.

"మనం వెళ్ళిపోదాం," అంది అతగాడి చెవిలో. ఆమె కన్నీళ్ళు అతగాడి చెంపలకు వెచ్చగా తగులుతున్నాయి.

"ఒద్దు పార్వతీ! నా కెవరూ వద్దు. నువ్వే కావాలి!" అన్నాడు ఆర్ద్రంగా. పదిరోజుల తర్వాత, విశ్వం తీరికగా డ్రెస్ చేసుకుని, పార్వతి ఎదురుగా వచ్చి నిల్చున్నాడు. పార్వతివేపు చూస్తూ, కొంటెగా కన్ను గీటుతూ అడిగాడు "ఎలా వున్నాను పార్వతీ?"

"అందంగా, హుందాగా, రాజాలా, ఊహూఁ! నే చెబితే నమ్మరు." అంది పార్వతి. చటుక్కున పార్వతి భుజాల చుట్టూరా చేతులువేసి అన్నాడు విశ్వం, "నమ్ముతున్నాను పార్వతీ! ముమ్మాటికీ నమ్ముతున్నాను. ఏదో-బలహీనత, ఆకర్షణ తగ్గిపోతోందేమోనన్న భయంతో వేసిన నా పిచ్చివేషాలు ఇంకా గుర్తుంచుకోకు! మరో విషయం చెప్పనా?" విశ్వం సందేహిస్తూ ఆగాడు.

"చెప్పండి!" నవ్వింది పార్వతి.

"ఏదో చాటుమాటుగా, మరో ఆడపిల్ల మెచ్చుకుంటోందంటే, గొప్పగా, గర్వంగా వుంటుందిగానీ, ఆ పిల్ల చివరకు దెయ్యంపిల్లలా పట్టుకొని పదిమంది వున్నా లేకున్నా, ఎగబడి వస్తే మాత్రం, పెళ్ళాడమని పట్టుబడితే మాత్రం, ఏ మగాడూ తట్టుకోలేడు. మీ "పిల్ల పిశాచాన్ని" వదిలించుకొనేసరికి తాతలు దిగివచ్చారనుకో! నువ్వులేవని మరింతగా విజృంభించింది. కానీ నువ్వులేని లోటేమిటో నాకు తెలుసు. అదో! పోస్ట్ వచ్చిందల్లే వుంది. నీకు నీ ఫ్రెండేమిటో పెద్ద కవరే వ్రాసిందోయ్! చాలా బరువుగా వుంది!" అన్నాడు విశ్వం, కవరు పార్వతి చేతికిస్తూ.

"డియర్ పార్వతీ! ఈ సరికి మీ మనసులూ, మీ సంసారం, విడివిడిగా, జమిలిగా కుదుటబడి వుంటాయను కుంటాను.

నీ విషయంలో మా శ్రీవారు కాస్త అతిగా ప్రవర్తించారని నాకు తెలుసు. అది మే మిద్దరం ఆడిన నాటకం అని తెలియజేయటానికి ఎంతైనా సంతోషిస్తున్నాం. (రాజకీయ భాషలే!) నీలో ఆ ఉద్రేకమూ, వివేకమూ వస్తే తప్ప, తెప్పిస్తే తప్ప కథ సుఖాంతం కాదని మేము భావించాము. అదే కరెక్టయింది. ఈ విషయంలో జరిగిన ప్రతి సంఘటనా (అది నా డైరెక్షన్‌తో జరిగినదే!) మరచిపొమ్మనీ, తనని ఏ క్షణం లోనూ అపార్థం చేసుకోవద్దనీ, ఓ సోదరునిగా (ఛ! సినిమాలలో సోదరుడు కాదే!) మన్నించమనీ మా శ్రీవారు నీకు మరీ మరీ వ్రాయమన్నారు.

కానీ అంత మాత్రానికి మా వారు అపర శ్రీరామచంద్రులని భ్రమపడి పోయావంటే, అది నీ అవివేకానికి పరాకాష్ఠ!

ఓ రహస్యం చెబుతా విను. దేవ రహస్యం కాదనుకో!

"ఆఫ్టర్ థర్టీఫైవ్" ముప్పై ఐదేళ్లు నిండాక, ప్రతి మగాడికీ కాస్తో, కూస్తో, ఓ విధమైన జంకు పట్టుకుంటుంది. (బైదిబై ఆడ వాళ్ళకు కూడా!) తామిక పెద్దవాళ్ళలా అయిపోతున్నామేమో నని! రొమాంటిక్ లైఫ్‌కి పనికిరామేమోనని! ఆకర్షణ (ఇతరుల నుండి) వుండదేమోనని! ఆ భావం వాళ్ళకు ఊపిరి సలపనివ్వదు. ఎంతటి ఆదర్శ పురుషులు, (స్త్రీలు కూడా) "పోజ్"లు వేసేది, కాస్తంత ఆశ పడేది, చలించేది ఆ వయసులోనే సుమా! (పైవి పురుషులకూ, స్త్రీలకూ క్రమాలంకారాలుగా చదువుకో!)

ఆ ఆకర్షణశక్తి వుందన్న నమ్మకం మగాడిలోగానీ, ఆడదానిలో గానీ సన్నగిల్లిందంటే, ఇక ముందు జీవితం జీరో! థ్రిల్ లేదు, హుషారు లేదు, సుఖంలేదు, అనుభూతిలేదు, ఏమీలేదు. ముసలి పీనుగుల్లా ఈదురో మంటూ ఈడవాల్సిందే!

ఆ ఆకర్షణ మిగిలి వుంటేనే మనకూ సుఖం-మన భర్తల ద్వారా! (బొత్తిగా బరితెగించాననుకోకు! నిజాలు కొన్ని ఇంత పచ్చిగానూ, పిచ్చి గానూ వుంటాయి మరి!)

అందుకే-వాళ్ళు తమలో ఇంకా ఆకర్షణశక్తి మిగిలివుందని నిరూపించు కొనేందుకు పడేపాట్లు, వేసే వేషాలు (వెర్రివని తెలిసినా) సహించాలి. చూచీ చూడనట్లూరుకోవాలి! జలసీ పెంచుకొంటే, వాళ్ళలో ముసలితనాన్ని పెంచటమే!

తప్పు చెయ్యలేరు. చేసేవాళ్ళు ఎలాగూ మనకు చెప్పి, మనకు భయపడుతూ చెయ్యరు!

ఏదో తృప్తిపడతారు. తమకోసం పరాయి ఆడది పడిచస్తోందని, అంతటి "ఛార్మ్", అంతటి మగసిరి, తమలో వుందని మురిసిపోతారు ! (మనం మాత్రం పరాయి మగాడు మనల్ని మెచ్చుకుంటే, పొంగిపోవటం లేదూ ! మెచ్చుకోవాలని మేకప్ చేసుకోవటం లేదూ ! అయితే ఇది అంత ర్గతం ! మగాళ్ళ వేషాలు బహిర్గతం ! పాపం ! అదే తేడా !)

సరే, ఏం చెబుతున్నానూ ! ఆ మురుపే మనకూ వారినుండి కావల సిన రీతిలో కావలసిన సుఖాన్నీ, ఆనందాన్నీ అందిస్తుంది. దానివల్ల మనకు లాభమేగానీ నష్టంలేదు. లెట్ దెమ్ ఎంజాయ్ దెమ్ సెల్వ్స్ !

మీ శ్రీవారికీ - మా శ్రీవారికీ - ప్రపంచంలో నూటికి తొంభై తొమ్మిది మందికీ అదే జబ్బు ! ఆ జబ్బులేని మిగిలిన ఒక్కడూ, సిసలైన యోగో, ఏమీ తెలియని అమాయక అర్భకుడో అయివుంటాడు.

నీలోనూ, నాలోనూ కూడా వున్న జబ్బదే ! నిజానికి "ఆఫ్టర్ థర్టీ ఫైవ్" నిజమైన జీవితం ప్రారంభం అవుతుందంటాను. ఈ నా సిద్ధాంతం నువ్వు అవునన్నా, కాదన్నా, నేను అవునంటాను.

అలంకరణపట్ల శ్రద్ధ, అనురాగం, కొత్త ఆకర్షణ, జలసీల మధ్య పోరాటం, ఆకర్షణ, వికర్షణ, సంఘర్షణ .... వెధవ కవిత్వం బోర్ కొడుతోం దంటావా ?

ఇక వుంటా

ప్రస్తుతం నువ్వు మరిచిపోయిన

నీ

సుధ

"దాని వ్యధ !"

ఉత్తరం చదవటం పూర్తిచేసి, విరగబడి నవ్వింది పార్వతి. "ఆఫ్టర్ థర్టీఫైవ్ ! ఎస్ కరెక్ట్ !" అందామె నవ్వాపుకుంటూ విశ్వం వేపు చూస్తూ.

("జోతి" మార్చి 1974)

| |
|---|
| 'అనుమానపు రకాలకు', 'ఆరితేరిన' ఘటాలకు ఇది వర్తించదు. అడల్ట్స్‌కు- అందునా మనసు పరిణతి చెందిన అడల్ట్స్‌కు మాత్రమే ! |